
సాక్షి ఒడిశా

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,98,431లు, బంగారం 3 గ్రాముల 100 మిల్లీగ్రాములు వెండి 22 గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హాస్టల్ ఫీజులు రద్దు

ప్రభుత్వం విద్యార్థులకు హాస్టల్ ఫీజులు రద్దు చేసింది. బాలల దినోత్సవాలు ఘనంగా జరిగాయి.

- 8లో



ఒడిశా అవార్డుల పేరు మార్పు

ఒడిశా చలన చిత్ర అవార్డుల పేరు మారింది. ఈ మేరకు కొత్తపేరు ఖరారు చేశారు.

- 8లో

వరి సేకరణపై దిశానిర్దేశం



వరి సేకరణ సన్నద్ధత సమీక్ష సమావేశం

- వరి సేకరణ సన్నద్ధతపై సీఎం సమీక్ష
- పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

భువనేశ్వర్: వరి సేకరణ వ్యవస్థని క్రమబద్ధీకరించేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా నడుం బిగించారు. ఈ నేపథ్యంలో స్థానిక లోక్ సేవా భవన్ నుంచి గురువారం ఆయన కలెక్టర్లతో వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి వరి సేకరణ ఆరంభం అవుతుంది. బర్‌గడ్ కేంద్రంగా ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు నిర్ణయించారు. అనంతరం డిసెంబరు నెల 8వ తేదీన బర్‌గడ్ జిల్లా సాహేలా ప్రాంతంలో రైతులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. ఈ సందర్భంగా రైతులకు అదనపు రూ. 800 చెల్లిస్తారు. ఇబ్బంది లేని వ్యవస్థతో ఈ ఏడాది వరి సేకరణ కొనసాగించాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ల వర్గం ముఖ్యమంత్రికి తెలిపింది. ఈ నెల 20న తొలుత బర్‌గడ్ నుంచి వరి సేకరణకు శ్రీకారం చుడతారు. తదుపరి ఈ నెల 22న సంబలపూర్ నుంచి ఈ ప్రక్రియని ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వరి సేకరణ ఊపందుకుంటుంది. ఈ సీజన్‌లో రైతులకు క్వింటాలు వరికి ప్రభుత్వం కనీస మద్దతు ధరగా రూ. 2,300 చెల్లిస్తుంది. మరో దశలో రైతాంగానికి రూ. 800 చొప్పున అదనపు మొత్తం విడుదల చేస్తారు. బర్‌గడ్ జిల్లా సాహేలా ప్రాంతంలో ప్రత్యేకంగా రైతు సదస్సు ఏర్పాటు చేస్తారు. ముఖ్యమంతి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అదనపు రూ. 800 మొత్తం విడుదల చేయనున్నారు. ఈ మొత్తం విడుదల చేసిన 48 గంటల వ్యవధిలో లబ్ధిదారుల పొదుపు ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ (డీబీటీ) అవుతుంది.

నేటి నుంచి టోకెన్ల పంపిణీ

వరి విక్రేతలకు టోకెన్ల పంపిణీ ఈ నెల 15 శుక్రవారం నుంచి ఆరంభం అవుతుంది. ఈ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు పరిస్థితులకు అనుగుణంగా వారం రోజుల పాటు పొడిగించే అవకాశం కలెక్టర్లకు కల్పించారు. వరి సేకరణ సరళీకరించే దృక్పథంతో ఈ ప్రక్రియపై సన్నకారు, బలహీన రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవగాహన, సమాచార కార్యక్రమం ప్రారంభించింది. మండీ ప్రాంగణాల్లో ధాన్యం విశ్లేషకులు, నాణ్యత నిర్ధారణ, సూపర్‌వైజర్లని ప్రభుత్వం నియమించింది.

అనధికారిక ప్రవేశంపై నిఘా

వరి సేకరణ ప్రక్రియలో రాష్ట్రేతర వరి చొరబాటు నివారణపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రాష్ట్రం సరిహద్దు ప్రాంతాల్లో ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి వరి ప్రవేశించకుండా కలెక్టర్లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో సీసీటీవీ వ్యవస్థ పటిష్టతతో పహరా వ్యవస్థని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. వరి అవాంఛిత వృథా నివారణ పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రొ, సహకార శాఖ మంత్రి ప్రదీప్ బొలా సామంత్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ బిహారి ధొలొ, వ్యవసాయం, రైతు సాధికారిత విభాగం ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

బాక్సైట్ తవ్వకాలకు మద్దతుగా ర్యాలీ



సిజిమాలి బాక్సైట్ గనుల్లో తవ్వకాలకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



కలెక్టర్ పట్నాయిక్ వినతిపత్రం సమర్పిస్తున్న యువకులు

రాయగడ: జిల్లాలోని కాశీపూర్‌సమితిలో ప్రకృతి సంపదలు సద్వినియోగం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వనరులను సద్వినియోగం చేసుకోవాలని స్థానికులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి వినతిపత్రంను కలెక్టర్ ఫరూల్ పట్వారీకి గురువారం అందజేశారు. కాశీపూర్ సమితిలో గల బాక్సైట్ గనులను తవ్వేందుకు వేదాంత్ అనే బృహత్తర కంపెనీకి ప్రభుత్వ అనుమతి ఇచ్చిందని అందుకు ఆ కంపెనీ ఆధ్వర్యంలో గల మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ తవ్వకాలకు ముందుకువస్తే కొందరు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. మైత్రీ సంస్థకు మద్దతుగా వారంతా మాట్లాడారు. కాశీపూర్ ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఆ ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. డీసీసీ మాజీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ పండ, బీజేడీ సీనియర్ నాయకుడు జగదీష్ పాత్రొ, సమితి అధ్యక్షులు కొంతొమాజి, ఇతర పార్టీలకు చెందిన నాయకులు తమ మద్దతును తెలిపారు.

మానసిక వికాసానికి నవ్వు అవసరం



విద్యార్థులను నవ్విస్తున్న డాక్టర్ మహంతి

రాయగడ: మానసిక వికాసానికి నవ్వు చాలా అవసరమని వక్తలు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రేమ్ పహాడ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సాయిప్రియనగర్ వద్ద గల ట్రైబల్ బాలుర హోం వద్ద గురువారం యోగా, నవ్వు ప్రక్రియ గురించి క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాబూరావు మహంతి కార్యక్రమాలను నిర్వహించారు. మానసిక వికాసానికి నవ్వు ఎంతో అవసరమని, యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతోందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతో పాటు ఇటువంటి కార్యకలాపాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని మహంతి సూచించారు. శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు సక్రమంగా సాగుతోందన్నారు.

తమ్మా నది నీటిని విడుదల చేయాలి

- రైతు సంఘాల నాయకులు



అధికారులకు వినతిపత్రాలను అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల, పోడియా సమితుల మధ్య ఉన్న తమ్మా నది కెనాల్ నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా 16 పంచాయతీలకు చెందిన రైతులు గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కెనాల్ మరమ్మతుల కోసం 2021లో నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని పోటేర్ ఇరిగేషన్ తరఫున రైతులకు సమాచారం ఇచ్చారు. కానీ మూడేళ్లు గడిచినప్పటికీ పనులు పూర్తి చేయలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు హామీని నిలబెట్టుకోలేకపోయారు. దీంతో రైతులు అధికారులను కలుస్తూ సమస్యను వివరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు ఎర్ర పోడియమి కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ముక మడ్కమి, పదియం కవాసి, సీక్‌పల్లి సర్పంచ్ విజయ్ కవాసి, చిత్రంగ్‌పల్లి సర్పంచ్ కౌశల్య కవాసి, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జయపురం ఎంజీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఎంజీ రోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ తదితర అధికారులు



ఆక్రమణలను స్వయంగా తొలగించుకుంటున్న వ్యాపారులు

జయపురం: స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు(ఎంజీ రోడ్డు)లో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్డు వెడల్పు చేసేందుకు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను గురువారం అధికారులు ప్రారంభించారు. వెలకం జంక్షన్ నుంచి గాంధీ జంక్షన్ వరకు 40 అడుగుల రోడ్డు ఏర్పాటుకు జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి పర్యవేక్షణంలో జేసీబీ యంత్రాలతో తొలగింపు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసు యంత్రాంగం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపాలిటీ వారు కొలతలు వేసి మార్క్ చేసినంత వరకు కొంత మంది వ్యాపారులు స్వయంగా కట్టడాలను తొలగించారు. ఆక్రమణల తొలగింపుపై అధికారులు కసరత్తు చేస్తుండటంతో వ్యాపారులు అధికారులను కలిసి రోడ్డు వెడల్పును 20 అడుగులకు బదులు 18 అడుగులు చేయాలని కోరారు. అయితే అధికారులు అంగీకరించలేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం రోడ్డు వెడల్పు కోసం ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. అయితే దీనిపై కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ భవన్‌లో నెహ్రూ జయంతి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ భవన్‌లో జవహర్ లాల్ జయంతిని గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్ గోవింద పాత్రో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బైక్ ప్రమాదంలో విద్యార్థి మృతి

- ఇద్దరికి గాయాలు



బొయిపరిగుడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

జయపురం: జయపురం పోలీసు పరిధి జయపురం–బొయిపరిగుడ 326 విజయవాడ–రాంచీ జాతీయ రహదారిపై మహుళి గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒక విద్యార్థి దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన విద్యార్థిని బొయిపరిగుడ సాహిత్ లక్ష్మణ నాయిక్ ఉన్నత పాఠశాలకు చెందిన సుధీర్ బిశాయిగా గుర్తించారు. సాయి హరిజన్, సంజీవ హరిజన్‌లు గాయపడగా వారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాళీ ప్రధాన్ గురువారం తెల్పపారు. సుధీర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొయిపరిగుడ ఆస్పత్రికి తరలించామన్నారు. బుధవారం స్కూల్ విడిచి పెట్టిన తరువాత సుధీర్, సాయి, సంజీవ్‌లు ఒకే బైక్‌పై జయపురం వెళ్లారు. జయపురం నుంచి తిరిగి బొయిపరిగుడ వస్తుండగా సాయంత్రం మహుళి గ్రామ రహదారిలో ఇనుపరాడ్ల గుట్టను బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. సుధీర్ సంఘటనా స్థలం వద్దనే ప్రాణాలు కోల్పోయాడు. ఏఎస్సై శివశంకర నాయిక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుగర్‌పై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

రాయగడ: ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పితామహాల్‌లో సెంచూరియన్ విశ్వవిద్యాలయం నర్సింగ్ విభాగం విద్యార్థులు, సాయికృప డయోగ్నొస్టిక్, వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా డయాబెటిక్‌పై అవగాహన కార్యక్రమాలను బుధ, గురువారాల్లో నిర్వహించారు. స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలోని మెడికల్ వార్డులో ఉన్న రోగులకు అవగాహన కల్పించడంతో ఉచితంగా మధుమేహ పరీక్షలను చేపట్టారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మధుమేహంపై చైతన్య పరిచారు. సెంచూరియన్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాఢి, ప్రిన్సిపాల్ ఊర్మిల కట్రు, డాక్టర్ చంద్రశేఖర్ పాత్రో, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

పతిత పావన కుడ్య ద్వారానికి వెండి తాపడం



పతిత పావనుడు

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో తొలుత దర్శన భాగ్యం కల్పించే పతిత పావనుని కుడ్య ద్వార బంధానికి వెండి తాపడం చేయనున్నారు. ద్వార బంధం, తలుపులకు వెండి తాపడం చేయాలని నిర్ణయించినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. రత్న భాండాగారం పరిసరాల్లో లోక నాథ్ స్వామి ఆలయానికి వెండి తాపడం చేయనున్నారు. స్వామి పల్లకి కూడ వెండి సొబగులతో జిగేల్‌మంటుందని సీఏఓ వివరించారు. త్వరలో ఈ పనులు ప్రారంభిస్తారు. ఇటీవల శ్రీ మందిరం ప్రధాన ద్వారాల తలుపులు, ద్వార బంధం వెండి తాపడం పనులు పూర్తి చేసిన విషయం తెలిసిందే.

బడికి తాళం



పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్తులు



పాఠశాల బయట విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొడిగూడ పంచాయతీ ఎంవీ 9 గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరే ఉపాధ్యాయులు ఉండగా వారు కూడా సరిగా బడికి రావడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కోపంతో గురువారం పాఠశాలకు తాళం వేశారు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి తహసీల్దార్ పాఠశాల వద్దకు వెళ్లి వారిని సముదాయించారు.

బీజేపీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిలు నిరాకరణ

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ విపక్ష నేత జయ నారాయణ మిశ్రాకు ముందస్తు బెయిలు మంజూరు చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు సిబ్బందిపై చేయి చేసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు అనుకూల ఉత్తర్వులు జారీ చేస్తే నిష్పక్షపాత దర్యాప్తు ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుందని సుప్రీం కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. 2023 సంవత్సరం ఫిబ్రవరి నెల 15న సంబల్‌పూర్ జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదురుగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నిరసన ప్రదర్శనతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బలవంతంగా కార్యాలయంలోనికి చొరబడుతన్న జయ నారాయణ మిశ్రాని అడ్డుకునే సమయంలో మహిళా పోలీసు సిబ్బందిపై చేయి చేసుకోవడంతో దుర్భాషలాడారు. ఈ ఆరోపణతో మహిళా పోలీసు సిబ్బంది ఆయనకు వ్యతిరేకంగా ఠాణాలో ఫిర్యాదు దాఖలు చేశారు. ఆమెకు వ్యతిరేకంగా జయ నారాయణ మిశ్రా కూడా ఫిర్యాదు చేశారు. ఈ పరిస్థితుల్లో ముందస్తు బెయిలు కోసం జయ నారాయణ మిశ్రా రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. కేసు పూర్వాపరాల్ని పరిశీలించిన న్యాయ స్థానం బెయిలు మంజూరు తిరస్కరించింది. ఈ ఉత్తర్వుల్ని సవాలు చేసి నిందిత నాయకుడు సుప్రీం కోర్టుని ఆశ్రయించారు. అక్కడ ఆయనకు చుక్క ఎదురైంది.

త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

- పర్లాకిమిడిఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి



పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

పర్లాకిమిడి: పర్లాకిమిడి నియోజికవర్గంలో కేంద్ర, రాష్ట్ర ఆమోదిత పథకాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అధికారులను కోరారు. జిల్లా పరిషత్ హాల్‌లో గురువారం తొలిసారిగా జరిగిన అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేశారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్‌దాస్ అధ్యక్షత వహించగా.. జెడ్పీ అధ్యక్షులు గవర తిరుపతి రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సీడీఎం గుణనిధినాయక్, డీఎఫ్‌వో సుబ్రహ్మణ్యం ఆనంద్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠిలు పాల్గొన్నారు. ముఖ్యంగా పర్లాకిమిడి నియోజకవర్గంలోని గుసాని, కాశీనగర్, గుమ్మా సమితిలలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 186 ప్రాజెక్టులకు ఆమోదం కాగా వాటిలో కేవలం 68 పనులు పూర్తవ్వగా.. 89 పనులు పూర్తికాలేదు. మొత్తంగా 23–24 వార్షిక సంవత్సరానికి కేవలం రూ.164.60 కోట్ల నిధులు ఖర్చు కాకుండా ఉండిపోయినట్టు డీఆర్‌డీఏ అధికారులు తెలియజేశారు. దీనిపై జిల్లా పరిషత్ అధ్యక్షులు జి.తిరుపతిరావు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.బాలరాజు గుసాని బీడీవో ఇంజినీర్లను నిలదీశారు. అలాగే అటవీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ నిధులపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో గుసాని సమితి అధ్యక్షులు ఎస్.వీర్రాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుమ్మా నుంచి సునేమీ మండళ్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..





వివాహ మండపంలో తులసీ దేవి, దామోదరులు (ఇన్‌సెట్లో)నగర ఊరేగింపులో వివాహిత తులసీ దేవి, దామోదరులు

జయపురం: స్థానిక సామంతరాయ్ సాహిలో 50 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత శ్రీకృష్ణ చైతన్య సంఘం వారు అపూర్వంగా మా తులసీ దేవి ప్రభు దామోదరల కల్యాణ క్రతువును బుధవారం రాత్రి సామంతరాయ్ కల్యాణ మండపంలో నిర్వహించారు. వివాహ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్త జనం పోటెత్తారు. వివాహ అనంతరం తులసీ దేవి, ప్రభు దామోదరలను అందమైన పల్లకిలో ఊరేగించారు. వివాహ మహోత్సవంలో ఆదివాసీ కళాకారులు నృత్య నాట్యాలతో సందడి చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగులతో పర్లాకిమిడి రాజా ప్యాలస్

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో గజపతి ప్యాలస్‌ను కార్తీక పౌర్ణమి సందర్భంగా విద్యుత్ వెలుగులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ చూపరులకు విశేషంగా ఆకర్షిస్తుంది. చాలా సంవంత్సరాల తరువాత గజపతి ప్యాలస్ విద్యుత్ వెలుగులతో అందంగా తీర్చిదిద్దారు.

రథ చక్రాల ఆదాయం రూ. 53 లక్షలు



శ్రీ జగన్నాథ రథ చక్రాలు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథ యాత్ర విశ్వ విఖ్యాతం. యాత్ర పురస్కరించుకుని ఏటా 3 భారీ కొత్త రథాలు తయారు చేస్తారు. ఇదో బృహత్తర కార్యక్రమం. రథాలపై స్వామి యాత్ర చేయడంతో ఈ రథాల పవిత్రత అపురూపం అవుతుంది. యాత్ర అనంతరం రథాల్ని విడదీస్తారు. చక్రాలు వంటి ప్రధాన విడి భాగాల్ని ఔత్సాహిక భక్తులు, సంస్థలు ఆసక్తితో కొనుగోలు చేస్తాయి. ఈ ఏడాది రథ చక్రాలు విక్రయించడంతో రూ. 53 లక్షల ఆదాయం చేకూరినట్లు శ్రీ మందిరం పాలక వర్గం సమాచారం. ఈ మొత్తం శ్రీ మందిరం ఖజానాలో జమ అవుతుంది.

విద్యా వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సెంచూరియన్ వర్సిటీలో విద్యావేంకటేశ్వర స్వామి

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో విద్యా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం సాయంత్రం కార్తీక మాసం సందర్భంగా లక్ష దీపారాధన జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దుర్గాపాడి తదితరులు హాజరయ్యారు. విద్యావేంకటేశ్వర స్వామి ప్రధాన అర్చకులు అరవెల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో లక్ష దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాసూరు, చుట్టు పక్కల గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అంతర్ మంత్రి మండలి



ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రం సరిహద్దు ప్రాంతాల్లో కొనసాగుతున్న అంతర్ రాష్ట్ర సమస్యల్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడు బిగించింది. ఈ నేపథ్యంలో అంతర్ మంత్రి మండలి ఏర్పాటు చేయనుంది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. పోలవరం, వంశధార, మహా నది, కొటియా గ్రామాల అంతర్ రాష్ట్ర సమస్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర న్యాయ, నిర్మాణం, అబ్కారి శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్, అడ్వకేటు జనరల్ పీతాంబర ఆచార్య, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ బిహారి ధొలొ, అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం ప్రముఖ కార్యదర్శి దేవ్ రంజన్ కుమార్ సింగ్, న్యాయ శాఖ ప్రముఖ కార్యదర్శి మానస రంజన్ బారిక్ హాజరయ్యారు.

విద్యార్థులకు హాస్టల్ ఫీజులు రద్దు

భువనేశ్వర్:

బాలల కలల సాకారానికి దృఢమైన విద్యా బోధన వ్యవస్థ అత్యంత కీలకమని సీఎం మోహన్ చరణ్ మాఝి అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక బాలల కార్యక్రమం సురభి ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించారు. ముఖ్యమంత్రితో రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాలల సృజనాత్మకతని ప్రతిబింబించే పలు స్టాళ్లను ఆయన ప్రత్యక్షంగా సందర్శించారు. బాలలతో కలిసి ముచ్చటించారు. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా విధానం వాస్తవ కార్యాచరణలో జాప్యంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. విద్యా రంగం అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెటులో రూ. 35 వేల 536 కోట్ల నిధులు కేటాయించినట్లు ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

హాస్టలు ఫీజులు రద్దు

డ్రాపౌట్ల నివారణ దృష్ట్యా విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మాధో సింగ్ విద్యార్థుల భృతి పథకం ప్రవేశ పెట్టింది. విద్యార్థులకు హాస్టలు ఖర్చులు మినహాయించారు. దీంతో విద్యార్థులపై ప్రతి నెల రూ. 2,000 వంతున ఆర్థిక భారం తొలగిపోతుంది. ఈ మొత్తం రాష్ట్ర ఖజానా నుంచి విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.



భువనేశ్వర్: దివ్యాంగుల సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన కేంద్రం సందర్శనలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి.

కేంద్రీయ విద్యాలయంలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో వున్న కేంద్రీయ విద్యాలయంలో గురువారం చిల్డ్రన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల ఆహార పదార్థాలు విక్రయించారు.

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రకాశ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు సురేంద్ర పట్నాయిక్ పాల్గొన్నారు. బాలల దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అంగన్‌వాడీల్లో..

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన ఆరుగురు చిన్నారులకు బహుమతులు అందజేశారు.



భువనేశ్వర్: చిన్నారి ప్రతిభకు ముఖ్యమంత్రి సత్కారం.



మల్కన్‌గిరి : ముడీ మిక్చర్ విక్రయిస్తున్న విద్యార్థులు



జయపురం: బాలల దినోత్సవంలో పాల్గొన్న అతిథులు, ప్రధాన ఉపాధ్యాయుడు.



భువనేశ్వర్: విద్యార్థుల నైపుణ్య ప్రదర్శన వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి



మల్కన్‌గిరి : పెరుగు వడలు అమ్ముతున్న విద్యార్థులు



జయపురం: పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



మల్కన్‌గిరి : అంగన్‌వాడీ విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

పోటెత్తిన భక్తులు..





సంధ్యాహారతి కోసం పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్లో) నృసింహ, వారహావతారంలో జగన్నాథుడు, బలభద్ర

పర్లాకిమిడి: స్థానిక జగన్నాథ మందిరం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన సంధ్యాహారతిని తిలకించడానికి భక్త జనం పోటెత్తారు. గత రెండు రోజులుగా కొందరు చేతివాటం ప్రదర్శించి మహిళల మెడల్లో బంగారు గొలుసులు, మొబైల్స్ దొంగతనాలు జరుగుతున్నట్లు ఆదర్శ పోలీసు స్టేషన్‌లో వద్ద ఫిర్యాదులు చేస్తున్నారు. గురువారం అర్ధ రాత్రి 12 గంటల నుంచి కార్తీక పౌర్ణమి ఉంటుంది. వేకువ జామున మహిళలు మహేంద్రతనయ నదిలో అరటి తెప్పలు విడిచిపెడతారు.

బాబోయ్ చలి

భువనేశ్వర్: రాష్ట్రంలో క్రమంగా శీతాకాల వాతావరణం నెలకొంటోంది. అత్యధిక ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగుతుండగా స్వల్పంగా కొన్ని ప్రాంతాల్లో పొగ మంచు కమ్ముతోంది. ఈ నెల 16 శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రాత్రి పూట ఉష్ణోగ్రత 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని స్థానిక వాతావరణ విభాగం తెలిపింది.

అంబులెన్సులో ప్రసవం

కాశీబుగ్గ: మందస మండలం కుడుమాసాయి గ్రామానికి చెందిన సవర విజయలక్ష్మి (21) అనే నిండు గర్భిణికి బుధవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో పలాస 108 సిబ్బంది వెంటనే స్పందించారు. సకాలంలో గ్రామానికి చేరుకొని గర్భిణిని అంబులెన్సులో తీసుకొస్తుండగా మార్గమధ్యలో రెంటికోట సమీపంలో ప్రసవం జరిగి పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను క్షేమంగా పలాస ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది పాసాల సత్యం, కెల్లి శ్రీనివాసరావు, ఆశ కార్యకర్త మేరితో పాటు ఫోన్‌లో సలహాలు అందించిన డాక్టర్ గాయత్రిలను పలువురు అభినందించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



సమావేశానికి హాజరైన అధికారులు

జయపురం: స్థానిక మునిసిపాలిటీ కౌన్సిల్ సభా గృహంలో గురువారం భీమభొయి దివ్యాంగ సహాయక శిబిర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మేన్ నరేంద్ర కుమార్ మహంతి అధ్యక్షత వహించారు. మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు మాట్లాడారు. దివ్యాంగులు, వితంతువులు, కిన్నెరలు, భిక్షకులు, కుష్టి రోగులు, సీనియర్ సిటిజన్‌లను గుర్తించటం జరుగుతుందని వెల్లడించారు. గుర్తించిన వారికి వివిధ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, కుత్రిమ అవయవాలు అందిస్తామన్నారు. ఈ శిబిరం ఈ నెల 22వ తేదీన స్థానిక టౌన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, అన్ని వార్డుల కౌన్సిలర్లు, దివ్యాంగ సంఘ అధ్యక్షుడు పురుశోత్తమ బొలో, సీడీపీఓ, బ్లాక్ విద్యాధికారి, ఓఎస్ఎస్ఆర్టీసీ అధికారులు, తహసీల్దార్‌లు, ఏకత సంఘ కొరాపుట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సంబల్ పురి డ్యాన్సులో స్థానిక కళాకారులు

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో గురువారం సాయంత్రం జగన్నాథ మందిరం ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఒడిస్సీ భజన, నృత్య సంధ్య అనే ఆధ్యాత్మిక కార్యక్రమాలను పరలా కళా సాంస్కృతిక సేవా ట్రస్టు పేరిట హైటెక్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి నిర్వహించారు. జగన్నాథ ఇతిహాస నృత్య రూపకాన్ని తృప్తిమయి కోరో నృత్యం రూపకంలో ప్రదర్శించారు. జగన్నాథ అకాడమీ, సమలై నృత్య అకాడమీ, అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన జగన్నాథ ఒడిస్సీ కళా కేంద్రం డి.ప్రియాంక పర్యవేక్షణలో ఒడిస్సీ నృత్యాన్ని తన శిష్యగణం ప్రదర్శించారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కళాకారులకు సత్కారం చేశారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన ప్రముఖ గాయకులు డాక్టర్ చందన్ గంతాయత్ జగన్నాథ భక్తి పాటాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలు తిలకించడానికి వేలాది మంది ప్రజలు విచ్చేశారు.



ప్రియాంక నేతృత్వంలో ఒడిస్సీ నృత్యంలో భంగిమ



సంబల్‌పురి కళాకారులకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం



సంబల్‌పురి డ్యాన్సు చేస్తున్న సమలయి నృత్య సంస్థ కళాకారులు

ఒడియా చలన చిత్ర పురస్కారం పేరు మార్పు

భువనేశ్వర్: రాష్ట్ర చలన చిత్ర రంగంలో ప్రతిష్టాత్మక జయదేవ్ పురస్కారం పేరు మారింది. ఈ మేరకు ఒడియా భాష, సాంస్కృతిక విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ గురువారం ప్రకటించారు. ఇక నుంచి ఈ పురస్కారాన్ని మోహన సుందర్ గోస్వామి అవార్డుగా పేర్కొంటారని మంత్రి తెలిపారు. ఈ అవార్డు కింద విజేతకు రూ. 5 లక్షల నగదు పురస్కారంతో ట్రోఫీ మరియు ప్రశంసా పత్రం లభిస్తుంది. గత 3 ఏళ్లకు చలన చిత్ర రంగంలో జీవన సాఫల్యం సాధించిన ప్రముఖులకు మోహన సుందర్ గోస్వామి అవార్డు ప్రకటించారు.

2020 నుంచి 2022 సంవత్సరం వరకు ఈ అవార్డు కోసం కళాకారుల్ని ఎంపిక చేశారు. ఈ జాబితాని స్థానిక భంజ కళామండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకర్ల సమావేశంలో మంత్రి ప్రకటించారు. 33 వర్గాల్లో నైపుణ్యం ప్రదర్శించిన కళాకారుల్ని ఈ అవార్డు కోసం ఎంపిక చేయడం విశేషం.

2020 సంవత్సరం కోసం అనంత మహాపాత్రో ఎంపికయ్యారు. 2021 సంవత్సరానికి సినిమాటోగ్రాఫర్ శ్రీనివాస మహాపాత్రో, 2022 సంవత్సరానికి ప్రముఖ హాస్య నటుడు జయీ రామ్ సామల్ మోహన సుందర్ గోస్వామి అవార్డు అందుకుంటారు. 2020 నుంచి 2022 వరకు వరుసగా మూడేళ్లకు చలన చిత్ర రంగంలో పలు వర్గాల అవార్డుల్ని ప్రభుత్వం ప్రకటించింది.

ఉత్తమ చలన చిత్రాలు

సాహిద్ రఘు సర్దార్ (2020)
ప్రతీక్ష మరియు దాల్చిని (2021)
దామన్ (2022)



ఒడియా చలన చిత్ర పురస్కారం పేరు మార్పు ప్రకటించిన మంత్రి సూర్య వంశీ సూరజ్.

ఉత్తమ నటులు

దేబాశిష్ పాత్రొ, అమ్లాన్ దాస్ (2020)
అంకిత్ కుమార్, దీపాన్విత్ దాస్ మహాపాత్రొ (2021)
బాబూ సాన్ మహంతి (2022)

ఉత్తమ చిత్రానికి రూ. 2 లక్షల చొప్పున, ఉత్తమ దర్శకుడు, నటీనటులకు రూ. 1 లక్ష చొప్పున నగదు పురస్కారంతో ధృవపత్రం, పశంసా పత్రం ప్రదానం చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఉత్తమ నటీమణులు

నటి	చిత్రం	సంవత్సరం
కావ్యకిరణ్	సాహిద్ రఘు సర్దార్	2020
సూర్యమయి మహాపాత్రొ	దాల్చిని	2021
లోపముద్ర మిశ్రా	బొంరొ హత్తొ బాక్సొ	2022

ఉత్తమ దర్శకులు

దర్శకుడు	చిత్రం	సంవత్సరం
రాకేష్ సామల్	రోమియో రాజా	2020
సురేష్ పట్నాయక్	తృష్ణ	2021
సుధాంశు మోహన్ సాహు	మాయావి	2022

క్లుప్తంగా

పోలీసులకు బ్యాగ్ అప్పగింత



బాధితురాలకు బ్యాగ్ అందజేస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): రోడ్డు మీద దొరికిన బ్యాగును పోలీసులకు అప్పగించి ఓ యువకుడు ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. గరివిడకి చెందిన సుంకరి దినేష్‌కుమార్‌కు చీపురుపల్లి రైల్వే వంతెన సమీపంలో గురువారం ఓ హ్యాండ్ బ్యాగ్ దొరికింది. వెంటనే ఆ యువకుడు బ్యాగ్‌ను గరివిడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. అందులో ఉన్న మొబైల్, ఇతర సర్టిఫికెట్ల ఆధారంగా ఆ బ్యాగ్ జి. అగ్రహారం గ్రామానికి చెందిన కిలారి సంతోషిదిగా గుర్తించి, ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా గరివిడి ఎస్సై లోకేశ్వరరావు యువకుడ్ని అభినందించారు.

నిందితుడికి జైలు శిక్ష

జియ్యమ్మవలస: చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 25 వేల జరిమాన విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె. నాగమణి గురువారం తీర్పు చెప్పారు. చినమేరంగి ఎస్సై అనీష్ తెలియజేసిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుకు ఇద్దరు కుమార్తెలు కాగా వారు పెదమేరంగి కూడలిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. 2019 నంబర్ 8న ఫిర్యాదుదారు ఇద్దరు కుమార్తెలను గెంబలి దుర్గారావు (60) ఆటోలో తీసుకువస్తూ, పెద్ద కుమార్తె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు, ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా..అప్పటి ఎస్సై శివప్రసాద్ పోక్సో కేసు నమోదు చేశారు. వాద ప్రతివాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వ్యక్తి అరెస్ట్

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల రెల్లివీధికి చెందిన కోంకోట అప్పారావు మృతికి కారణమైన అదే గ్రామానికి చెందిన బంగారు రాముని గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ షణ్ముకరావు తెలిపారు. మంగళవారం గ్రామంలో జరిగిన గౌరమ్మ సంబరాల్లో మృతుడు అప్పారావుకి, నిందితుడు రాము మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈక్రమంలో అప్పారావు గుండెపై రాము తన్నడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని కొత్తవలస న్యాయస్థానంలో హాజరుపరచగా.. రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

శివాలయంలో నాగుపాము

- కార్తీక పౌర్ణమి వేళ అయ్యప్ప భక్తుల పూజలు



ఆలయంలోని భ్రమరాంబిక సన్నిధిలో నాగుపాము

భామిని: మండలంలోని పాత ఘనసర గ్రామంలో గల శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం నాగుపాము దర్శనమిచ్చింది. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప సన్నిధానంలోని స్వాములు ఆలయంలో తెల్లగా మెరుస్తున్న నాగుపామును గుర్తించి పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి ఘడియల్లో నాగుపాము దర్శనమివ్వడాన్ని అదృష్టంగా భావించి భక్తితో పూజలు చేశారు. ఉదయం ఆలయంలోని శివలింగం వరకు వచ్చి వెళ్లిన నాగుపాము రాత్రి మరోసారి దర్శనమిచ్చిందని అయ్యప్పస్వాములు తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు అక్కాచెల్లెళ్లు



రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు లిఖితారావ్, తశ్వితరావ్

రామభద్రపురం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్‌లో చదువుతున్న అక్కా చెల్లెళ్లు టి. లిఖితరావ్, టి. తశ్వితరావ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈ నెల 10వ తేదీన విజయనగరం విజ్జి స్టేడియంలో సబ్ జూనియర్ విభాగంలో నిర్వహించిన తైక్వాండో పోటీలలో ప్రతిభ చూపి లిఖితరావ్ గోల్డ్ మెడల్, తశ్విత రావ్ బ్రాంజ్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ మేరకు విద్యార్థినులను పాఠశాల చైర్మన్ పోల వెంకటరమణ, కరస్పాండెంట్ చంద్రమోహన్, కోచ్ సుధాకర్, తదితరులు అభినందించారు.

అభివృద్ధి పనులపై నీలినీడలు..

- నత్తనడకన 'నాడు – నేడు' రెండో విడత పనులు
- మొదటి విడతలో 841 పాఠశాలల్లో రూ.186 కోట్లతో పనులు పూర్తి
- రెండో విడతలో 738 పాఠశాలలకు రూ.231 కోట్లు కేటాయింపు
- గదులు, మౌలిక వసతుల కొరతతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



రొంపల్లి ఉన్నత పాఠశాలలో బేస్‌మెంట్ స్థాయిలో ఆగిపోయిన పనులు



నత్తనడకన సాగుతున్న బూసాయవలస ఉన్నత పాఠశాల పనులు



నిధులు లేక అరకొర పనులతో ఉన్న జోగిందొరవలస ప్రాథమిక పాఠశాల

రామభద్రపురం: జిల్లాలో నాడు – నేడు రెండో విడత పాఠశాలల ఆధునీకరణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతుండగా.. మరికొన్ని పాఠశాలల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పాఠశాలలు పునఃప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా కుటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు –నేడు పథకం కింద ఆధునీకరణ పనులు చేపట్టింది. మొదటి విడత కింద 841 పాఠశాలలను రూ.185 కోట్లతో ఆధునీకరించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇక రెండో విడత కింద అభివృద్ధి చేయడానికి 738 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేస్తూ రూ.231 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. అయితే ఎన్నికల ముందు వరకు పనులు వేగంగా సాగినా, ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి.

నిలిచిన పనులు..

తొలి విడతలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా తిర్చిదిద్దింది. రెండో విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో రూ.85.50 కోట్లతో సుమారు 345 పాఠశాలల్లో కొంతమేర మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మిగిలిన 393 అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు మాత్రం సిమెంట్, ఐరన్‌తో పాటు అవసరమైన నిధులు రాక పనులు నిలిచిపోయాయని, త్వరలో ప్రారంభిస్తామని చెబుతున్నారు.

ఎం.బుక్‌లో నమోదు కాని పనులు

నిధులు రాకపోయిన కొంతమంది ఉపాధ్యాయులు నిధులు ఎప్పుడు వస్తే అప్పుడు తీసుకుందామనే ఉద్దేశంతో సొంత డబ్బులు పెట్టి పనులు పూర్తిచేశారు. అయితే పనులు పూర్తయి, తరగతులు నిర్వహిస్తున్నా.. సంబంధిత అధికారులు ఎంబుక్‌లో రికార్డు చేయని పరిస్థితి నెలకొంది. ఎం.బుక్‌లో నమోదు చేయండి మహాప్రభో అని ఉపాధ్యాయులు వేడుకుంటున్నా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..

రెండో విడత నాడు – నేడు కింద ఎంపికైన పాఠశాలలకు ప్రస్తుతం నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. కొద్దో గొప్పో నిధులు ఉన్న పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేయనుంది. విడుదలైన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

డీవీఎస్ మూర్తి, నాడు–నేడు ఈఈ, విజయనగరం

జన్ జాతీయ గౌరవ దివస్‌ను విజయవంతం చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: జన్ జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్ కల్టెర్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎత్తివేసినందున శుక్రవారం ఉదయం నుంచి జన్ జాతీయ గౌరవ దివస్ వేడుకలను జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కేవీఎస్ పద్మావతి, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు గయాజుద్దీన్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి. తిరుపతిరావు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



క్రీడాకారుల నుంచి వందనం స్వీకరిస్తున్న అధికారులు

పూసపాటిరేగ: క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు నాడీవ్యవస్థ ఉత్తేజం అవుతుందని బీఆర్ అంబేడ్కర్ గురుకులం జిల్లా కోఆర్డినేటర్ టి.ఎం.ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో గురువారం జోన్–1 జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, తహసీల్దార్ తాడ్డి గోవింద కలిసి క్రీడా పతాకాలను ఎగురవేశారు. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 10 గురుకుల పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలలో రాణించిన విద్యార్థులు ఎంతో మంది దేశంలో అత్యున్నతమైన అఖిలభారత సర్వీసులకు ఎంపికయ్యారని గుర్తుచేశారు. విద్యార్థులలో దాగివున్న సామర్థ్యాలను క్రీడల ద్వారా వెలికితీయవచ్చన్నారు. అనంతరం క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు వియ్యంపేట విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కె.వెంకటరమణ, జిల్లా క్రీడాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ తాడ్డి గోవింద, ప్రిన్సిపాల్ పి.రఘురాంనాయుడు, డీసీఓ రూపావతి, విశ్రాంత డీసీఓ చంద్రావతి, మండల స్పోర్ట్సు కోఆర్డినేటర్ పీవీఎల్ఎన్ కృష్ణ, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ చైల్డ్‌రైట్స్ ఫోరం, ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిర్మూలిద్దాం.. బాలల హక్కులను కాపాడుదాం.. అనే ఉద్దేశంతో రూపొందించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఫోరం అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ.. బాలల రక్షణకు అనేక చట్టాలున్నాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పోలయ్య, ప్రజల సంఘ ప్రతినిధులు పోతురాజు, రాము, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, చైల్డ్‌రైట్స్ క్లబ్ ప్రతినిధులు షేక్ మస్కాన్, షేక్ నఫీషా, అజయ్, బబ్లూ, వంశీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాపుశంభాం పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సహోపాధ్యాయులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. ఒంగోల్ ఆర్ట్ ఫెస్ట్ కళాయజ్ఞ, సృష్టి అకాడమీ ఆధ్వర్యంలో బాలలు, యువజనులకు ఇటీవల ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ చిత్రలేఖనం పోటీల్లో కాపుశంభాం ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రఘుమండ అనూష (పదో తరగతి), గొర్లె స్వాతి (తొమ్మిదో తరగతి), పెరుమాళి లక్ష్మి (ఎనిమిదో తరగతి), రేగాన చైత్ర (ఆరో తరగతి) బాల చిత్రకళా సృష్టి (గోల్డ్‌మెడల్) అవార్డు సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ అద్దాల కుమార్‌కు చిత్రగురు అవార్డు అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న 13 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను హెచ్‌ఎం డి. రాము, ఎస్‌ఎంసీ చైర్మన్ పి. రామకృష్ణ, ఉపాధ్యాయులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు



మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యంనాయుడు

డెంకాడ: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు ఆకాంక్షించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద తాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో, సాంకేతిక విద్యలో కూడా ముందుండాలన్నారు. ఈ–మ్యాగ్‌జైన్, తదితర వాటిని విజయవంతగా అమలు చేసేందుకు తగిన సూచనలు చేశారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, హెచ్‌ఎం వీవీఏ నరసింగరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఆర్‌కే స్కాలర్‌షిప్ ఆప్టిట్యూడ్ టెస్ట్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆర్‌కే ఐఐటీ అండ్ నీట్ అకాడమీలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం పదో తరగతి విద్యార్థులకు 'ఆర్‌కే స్కాలర్‌ష్ అండ్ ఆప్టిట్యూట్ టెస్ట్ (ఆర్‌కేఎస్ఏటీ)' పరీక్షను ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కోలా సంతోష్, డీన్ అల్లాడ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు హాజరయ్యే పదోతరగతి విద్యార్థులు పూర్తి వివరాల కోసం 94905 13355, 94901 53355 నంబర్లను సంప్రదించాలని కోరారు

భవనం పైనుంచి జారిపడి మహిళ మృతి



రమణమ్మ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శనపతి రమణమ్మ (54) ఇంటి నిర్మాణం చేపడుతోంది. బుధవారం రాత్రి రెండో అంతస్తుపై కుర్చీ వేసుకుని గోడలు తడుపుతోంది. అనుకోకుండా కుర్చీ జారిపోవడంతో ఆమె నేరుగా సిమెంట్ రోడ్డుపై పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు శనపతి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు. రమణమ్మ ప్రస్తుతం పంచాయతీ వార్డు మెంబర్‌గా ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు..

మక్కువ: మండలంలోని సరాయివలస, మార్కొండపుట్టి గ్రామాల మధ్య రహదారిపై అవమానాస్పదంగా గాయాలపాలైన పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన సాయికుమార్ (22)చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడి మృతిపై పలు అనుమానాలను వ్యక్తంజేస్తూ తండ్రి లంకేనా లక్ష్మణ పోలీసులకి ఫిర్యాదు చేశారు. ఈ నెల12వ తేదీ సాయంకాలం మక్కువ మండలం దుగ్గేరు గ్రామం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తానని చెప్పిన సాయికుమార్.. సరాయివలస – మార్కొండపుట్టి రహదారిపై గాయాలతో పడి ఉన్నాడు. స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి ..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు తెలిపారు. యార్డ్‌లో రూట్ నంబర్‌లో 9లో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు పింక్ కలర్ రెడీమేడ్ ఫుల్ హ్యాండ్ షర్ట్, బిస్కెట్ కలర్ ఫ్యాంట్ ధరించాడని, కుడి మోచేతి పైన పచ్చబొట్టు ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వసతిగృహాల్లో మెరుగైన సేవలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ వసతిగృహాల్లో మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ సుందర పార్వతీపురంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాంకేతిక విద్య, పరిశ్రమల శిక్షణ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులు నేర్చుకున్న విద్యను బహిర్గతం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజులావీణ, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, పాల్‌టెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

నాణ్యంగా 'పల్లె పండగ' పనులు



కొట్యాడలో మొక్కలు నాటేందుకు తీసిన గొయ్యిని పరిశీలిస్తున్న శివప్రసాద్, తదితరులు

లక్కవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులు నాణ్యంగా చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్ జాయింట్ అడిషనల్ కమిషనర్ ఎం. శివప్రసాద్ ఆదేశించారు. మండలంలోని కొట్యాడ, తలారి, ఖాసాపేట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి, పల్లె పండగ కార్యక్రమంలో మంజూరైన రోడ్లను పరిశీలించారు. అలాగే కొట్యాడలో తోటల పెంపకానికి సంబంధించిన తీసిన గోతులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా ఇన్‌చార్జ్ పీడీ కల్యాణచక్రవర్తి, ఉపాధిహామీ పథకం ఎస్.కోట క్లస్టర్ ఏపీడీ ఎస్.శారదాదేవి, పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు, ఎంపీడీఓ ఎస్.అప్పారావు, పంచాయతీరాజ్ ఏఈ వీరలక్ష్మి, ఉపాధిహామీ ఏపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: జీడీఏ కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా స్ట్రైవ్ సౌజన్యంతో నిర్వహించే ఈ కోర్సులో చేరేందుకు 18 నుంచి 30 ఏళ్ల వయసు, ఇంటర్ పాస్/ ఫెయిల్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ పాసైన వారికి పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు కార్పొరేట్ ఆసుపత్రిల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన వారికి డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎన్‌సీడీసీపీ సర్వే ప్రారంభం

పార్వతీపురం: జిల్లావ్యాప్తంగా ఎన్‌సీడీసీపీ 3.0 సర్వేను ప్రారంభించినట్లు డీఎంహెచ్ఓ కె.విజయపార్వతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పార్వతీపురం పట్టణంలోని 22వ వార్డులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి జిల్లా వ్యాప్తంగా ఈ సర్వేను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు తీవ్రమయ్యే వరకు గుర్తించలేని పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు ఇంటింటి సర్వేను నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇంటింటి సర్వేలో మధుమేహం, బీపీ, కేన్సర్, మూర్ఛ, టీబీ తదితర వ్యాధులను వైద్యసిబ్బంది గుర్తిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీఎల్ రఘుకుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ కేవీఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు, ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.